# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ.. 2025-26 వార్షిక బడ్జెట్ కు రూపకల్పన చేశామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ ఎన్నికల హామీలకు కేటాయింపులు చేస్తూ.. 3 లక్షల 22 వేల కోట్ల రూపాయలతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 2025-26 వార్షిక బడ్జెట్ ను ఈ రోజు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.
- ❖ వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో 13 వేల 487 కోట్ల రూపాయలను కేటాయించామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.
- ❖ ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.
- ❖ జల్ జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రంలోని ప్రతీ ఇంటికీ రక్షిత మంచి నీటిని అందిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియజేశారు.

==========================

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ.. ఈ వార్షిక బడ్జెట్ కు రూపకల్పన చేశామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఈరోజు టీడీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బడ్జెట్‌ను ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. శాసనసభ్యులకు దిశానిర్దేశం చేశారు. ఈ బడ్జెట్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే బాధ్యత శాసనసభ్యులదేనని.. మళ్లీ శాసనసభకు రావాలనే భావనతో పని చేయాలన్నారు. ఎక్కడా విభేదాలకు తావులేకుండా సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

==========================

రాష్ట్ర శాసనసభలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 3.22 లక్షల కోట్ల రూపాయలతోవార్షిక బడ్జెట్ ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఈ రోజు ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా పూర్తిస్థాయి

బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయానికి 48 వేల కోట్ల రూపాయులు, రెవెన్యూ వ్యయం 2 లక్షల 51 వేల 162 కోట్లు, మూలధన వ్యయం అంచనా 40 వేల 635 కోట్ల రూపాయాలను కేటాయించారు. రెవెన్యూ లోటు 33 వేల 185 కోట్లు వుండగా, ద్రవ్య లోటు 79 వేల 926 కోట్ల రూపాయలుగా అంచనా వేశారు. అన్నదాత సుఖీభవ కోసం 6 వేల 300 కోట్లు, పోలవరం ప్రాజెక్టు కోసం బడ్జెట్‌లో 6 వేల 705 కోట్ల రూపాయలుగా కేటాయించారు.

===========================

ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఈరోజు శాసనసభలో ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలకు ఎక్కువ కేటాయింపులు జరపడంతో 2025-26 రాష్ట్ర బడ్జెట్ తొలిసారిగా 3 లక్షల కోట్ల రూపాయల మార్కును దాటిందని మంత్రి వెల్లడించారు. సంక్షేమానికి, వివిధ అభివృద్ధి పథకాలకు ఈసారి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. గతేడాది 2.94. లక్షల కోట్ల రూపాయలతో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టగా ఈసారి బడ్జెట్ 3 లక్షల 22 వేల 359 కోట్లకు చేరిందని తెలిపారు. వ్యవసాయ రంగానికి భారీగా కేటాయింపులు పెరిగాయని రాష్ట్ర ప్రగతికి అవసరమైన విధాన నిర్ణయాలు ఉన్నాయని బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. తెలుగు భాషాభివృద్ధికి 10 కోట్ల రూపాయల నిధులను కేటాయించామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంచేలా చర్యలు వుంటాయని, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో గ్రామీణాభివృద్ధిలో ముందడుగు వేస్తున్నామని పయ్యావుల కేశవ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

===========================

రాష్ట్ర పునర్నిర్మాణం, సంక్షేమానికి ఊతమిచ్చేలా బడ్జెట్ ఉందని పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. 2025-26 బడ్జెట్ కేటాయింపుల్లో పర్యాటక రంగం అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ రోజు అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ లో పర్యాటక, సాంస్కృతిక శాఖకు 469 కోట్ల రూపాయలు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి పర్యాటక రంగం చోదక యంత్రంగా పని చేయనుందన్నారు. ఆర్థిక ప్రగతిలో ఈ రంగానికి ప్రాధాన్యత పెరుగుతోందని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతూ.. విస్తృతంగా ఉపాధి కల్పిస్తోన్న ఏకైక రంగం పర్యాటక రంగం అని మంత్రి పేర్కొన్నారు.

===========================

వ్యవసాయ శాఖా మంత్రి కె. అచ్చెన్నాయుడు 48 వేల 340 కోట్ల రూపాయలతో రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్ ను ఈ రోజు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. వ్యవసాయ బడ్జెట్ లో ఎరువులు, ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ యంత్రాల రాయితీకి సంబంధించి భారీగా కేటాయింపులు చేశామని తెలిపారు. ఈ కేటాయింపుల వల్ల రైతులకు భారీగా మేలు చేకూరుతుందని బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు 13 వేల 487 కోట్ల రూపాయలను కేటాయించారని మంత్రి వెల్లడిస్తూ....

(వాయిస్ 36 సెకన్లు)

విరామం

===========================

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల అనంతరం రాష్ట్ర మంత్రులు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఈరోజు పాత్రికేయులతో మాట్లాడారు. అందులో భాగంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ వార్షిక బడ్జెట్ లో ఎన్నికల హామీలకు కేటాయింపులు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రంలోని ప్రతీ ఇంటికీ రక్షిత మంచి నీటిని అందించేందుకు ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. అలాగే ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ బడ్జెట్ లో ఆరోగ్య రంగానికి చేసిన కేటాయింపులపై స్పందిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========================

ఆంధ్రప్రదేశ్ లో గ్రీన్ ఎనర్జీ (హరిత శక్తి)ని ప్రోత్సహించి తద్వారా డిస్కంలపై అప్పుల భారాన్ని తగ్గిస్తున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. డిస్కంలను బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ ఈరోజు ముంబై వేదికగా నిర్వహించిన సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యశో నాయక్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ లతో పాటు నాలుగు రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రులు ఈ సమావేశానికి హాజరై.. ఆయా రాష్ట్రాల్లో డిస్కంల ఆర్థిక పరిస్థితులపై చర్చించారు. అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాత్రికేయులతో మాట్లాడుతూ... కేంద్ర ప్రాయోజిత పథకాలైన “సూర్యఘర్ యోజన..” “పీఎం కుసుమ్” వంటి పథకాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థవంతంగా వినియోగించుకుంటోందని తెలిపారు.

==========================

కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నెహ్రూ యువ కేంద్రం నిర్వహిస్తున్న సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు యువతకు ఎంతగానో దోహదపడుతున్నాయి. ఇందులో భాగంగా గుంటూరు జిల్లాలోని నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఒరిస్సాలోని పలు జిల్లాల నుండి వచ్చిన 25 మంది యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఒడిసా బృందానికి సమన్వయకర్తగా ఉన్న కోనికా బోస్ పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్ర సంస్కృతి, ఆహారపు అలవాట్లు, ఉపాధి అవకాశాలు ఆంధ్ర, ఒడిశా యువతలో గల ప్రాధమిక వ్యత్యాసాలు, అభివృద్ధి వంటి అంశాలపై యువతకు అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు.

==========================

ప్రజా అవసరాలకు అనుగుణంగా ఇంటి వద్ద నుంచే సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ సేవలను వినియోగించుకోవాలని గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వివిధ పౌర సేవలను త్వరగా అందించడానికి వాట్సాప్ గవర్నెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామనిఆయన వివరించారు. స్థిరాస్తులు, ఖాళీ స్థలాలు, నీటి పన్ను, వివాహ నమోదు, డ్రైనేజ్ కనెక్షన్, నూతన ట్రేడ్ లైసెన్స్ ధరఖాస్తు వంటి 32 మున్సిపల్ సేవలు ఈ వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులో ఉన్నాయని కమీషనర్ వెల్లడించారు.

==========================

==========================